సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9652278546
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అనాథాశ్రమానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం: మండలంలోని గొల్లపాలెంలో అనాథాశ్రమ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం భూమి పూజ చేశారు. స్వామి వివేకానంద మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ అనాథాశ్రమాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, కూటమి సీనియర్ నాయకులు బర్నికాణ బాబూరావు, ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, మిడతాడ మహాలక్ష్మినాయుడుతో పాటు పలువురు నాయకులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా నేడు

పెందుర్తి: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామన్న హామీని తక్షణమే నెరవేర్చాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా తలపెట్టనున్నట్లు సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు చినముషిడివాడ కూడలి నుంచి రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయి పట్టివేత

పెందుర్తి: అరకు నుంచి విశాఖ నగరానికి ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయిని పెందుర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఓ వ్యక్తి బ్యాగ్ నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. మహారాష్ట్ర పూణే ప్రాంతానికి చెందిన వైభవ్ మాగ్నేష్ భోసాలే అనే వ్యక్తి తన బ్యాగ్‌లో గంజాయిని నగరానికి తరలిస్తున్నాడు. పెందుర్తి వద్దకు బస్ వచ్చేసరికి సాధారణ తనిఖీలు చేస్తుండగా పట్టుబడడంతో గంజాయి స్వాధీనం చేసుకుని వైభవ్‌ను అదుపులోనికి తీసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

భౌగోళిక విజ్ఞానం అవసరం



సదస్సులో మాట్లాడుతున్న గురుకుల డీసీవో రూపావతి

మధురవాడ: భౌగోళిక విజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని గురుకుల డీసీవో రూపావతి చెప్పారు. మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ఆదివారం భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. విశాఖ చాప్టర్ ఐజీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భౌగోళిక విశ్లేషణ, శాస్త్రీయ విచారణ, కొత్త అధ్యయనాల ద్వారా చరిత్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డి. శాంతకుమారి, ఐజీఎస్ సభ్యురాలు ప్రొఫెసర్ బి. హేమమాలిని, సెక్రటరీ వజీర్ మహమ్మద్, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.మంగళమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలోని ఎల్లయ్య కాలువలో ద్విచక్ర వాహనంతో పడిన పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన యర్ర శ్రీనివాసరావు (33) తలకు తీవ్ర గాయమైంది. స్థానికల సహకారంతో పక్కనే ఉన్న ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

శ్రీకృష్ణదేవరాయల కీర్తికి కిలుము

సింహాచలం క్షేత్రంతో శ్రీకృష్ణదేవరాయలది విడదీయరాని అనుబంధం. తూర్పు రాజ్యాల విజయయాత్రలో భాగంగా సింహాచలేశుని దర్శించుకుని పులకాంకితులయ్యారు. స్వామివారికి విశేష ఆభరణాలు సమర్పించారు. సింహగిరి నుంచి బయల్దేరుతూ విజయస్థూపాన్ని ఏర్పాటు చేశారు. అంతటి ఘన చరిత్రను సగర్వంగా చాటిచెప్పే స్థూపానికి పాలకులు కిలుము(తుప్పు) పట్టించారు. పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ఆ ప్రాంగణం తుప్పలు మొలిచి, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా మారింది.

- నిరాదరణకు రాయల విజయస్థూపం
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచని వైనం
- సింహాచలం అధికారులదీ అదే దారి!



దీనావస్థలో శ్రీకృష్ణదేవరాయల విజయస్థూపం, (ఇన్‌సెట్‌లో) తుప్పపట్టిన స్థూపం పైభాగం



స్థూపం వద్ద 2016లో ఏర్పాటు చేసిన రాయల శాసన ప్రతిరూపం

సింహాచలం: సింహగిరిపై ఐదు శతాబ్దాల క్రితం శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా ఏర్పాటు చేసిన విజయస్థూపం, ఆ ప్రాంగణం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ఆ ప్రాంతాన్ని అధికారులు పట్టించుకోవట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు కొన్ని గంటలపాటు ఆ ప్రాంతంలో గడిపేందుకు అవకాశమున్నప్పటికీ ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవట్లేదు. దీని అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్తున్న అధికారుల మాటలు నీటిపై రాతలుగానే మిగులుతున్నాయి.

ఐదు శతాబ్దాల ఘనత

సింహగిరిపై మైక్రోటవర్‌కి వెళ్లే దారిలో శ్రీకృష్ణదేవరాయల విజయస్థూపం ఉంది. రాయలవారు తన విజయానికి ప్రతీకగా ఈ స్థూపాన్ని ఏర్పాటుచేసినట్లు చరిత్ర చెప్తోంది. తూర్పు రాజ్యాలను జయించేందుకు సింహాచలంను ఓ స్థావరంగా రాయలవారు ఏర్పాటు చేసుకున్నారని కూడా చెప్తారు. సింహాచలం క్షేత్రాన్ని 1516 మార్చి 29న ఆయన సందర్శించారు. సింహాద్రినాథుడి విశేషంగా కొలిచి, పలు ఆభరణాలు సమర్పించారు. తాను



విజయస్థూపానికి వెళ్లే దారి

రచించిన ఆముక్తమాల్యద గ్రంథం 4వ ఆశ్వాసంలో సింహాచలేశుని మహిమల్ని కీర్తిస్తూ పద్యాలు కూడా రాశారు. సింహాచల క్షేత్రం సందర్శనకు గుర్తుగా ఒక శిలా శాసనాన్ని కూడా రాయించారు. ఆ శాసనం ఆలయ బేడా మండపంలోని ఒక రాతి స్తంభంపై ఇప్పటికీ కనిపిస్తుంది.

ప్రణాళికలకే పరిమితం

ఇంతటి విశిష్టత కలిగిన రాయలవారి విజయస్థూపం ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడంలో ఆది నుంచీ నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. సింహాచలం వచ్చే భక్తులు, పర్యాటకులు ఈ ప్రాంగణాన్ని సందర్శించేందుకు వీలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు కూడా రూపొందించారు. పర్యాటకులు కూర్చునేందుకు బెంచీలు, విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ ప్రాంతానికి వెళ్లే రహదారిని బాగుచేస్తామని, అక్కడికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తామనీ చెప్పారు. ఈ ప్రణాళికలేవీ అమలుకు నోచుకోలేదు.

గంటా హామీ గాలికి!

శ్రీకృష్ణదేవరాయలు సింహాచలం దేవస్థానాన్ని సందర్శించి 2016 మార్చి 29తో 500 ఏళ్లు పూర్తయింది. దీంతో బేడామండపంలో స్తంభంపై ఉన్న శాసనాన్ని శిలాఫలకం రూపంలో కూడా దేవస్థానం తయారు చేయించి విజయస్థూపం వద్ద ఏర్పాటు చేసింది. ఆ శిలాఫలాకాన్ని అప్పటి మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అదే ఏడాది ఏప్రిల్ 8న ఆవిష్కరించారు. చారిత్రక ప్రాశస్త్యం కల్గిన విజయస్థూపంను సింహగిరికి వచ్చే భక్తులంతా సందర్శించేలా అభివృద్ధి చేస్తామని, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇనుప స్థూపం స్థానంలో రాతితో తయారుచేసిన స్థూపం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికీ అది ఆచరణను నోచుకోలేదు.

వ్యూ పాయింట్‌గా విజయస్థూపం

విజయస్థూపం ప్రాంగణంలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. స్థూపానికి సమీపంలో ఉన్న కొండ లోపలి భాగంలోంచి ఇనుప గొలుసులు పైకి కనిపిస్తాయి. ఇప్పటికీ ఆ గొలుసులు ఏ విధంగా ఏర్పాటు చేశారో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అప్పట్లో ఏనుగులను బంధించి ఉంచేందుకు ఆ గొలుసులను ఏర్పాటు చేసినట్లు చెబుతారు. రాయల విజయస్థూపం ప్రాంగణం నుంచి చూస్తే అటు శ్రీ రాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ వ్యూ కళ్లకు కనువిందు చేస్తుంది. ఆలయం చుట్టూ ఉన్న పచ్చని గిరులను వీక్షించవచ్చు. మరోపక్క దేవస్థానం పంచగ్రామాలతోపాటు, అడవివరం ప్రాంతం కూడా కనిపిస్తుంది.

అభివృద్ధి చేయాలి



శ్రీకృష్ణదేవరాయల విజయ స్థూపం ప్రాంగణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. కృష్ణదేవరాయలంటే తెలియని వారు లేరు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఈ ప్రదేశాన్ని సింహాచలం వచ్చే ప్రతి భక్తుడు, పర్యాటకుడు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలి. అప్పుడే ఆధ్యాత్మికతతోపాటు, మన ఘన చరిత్రను భావి తరాలు తెలుసుకునేందుకు వీలుంటుంది.

– పూర్ణ, పద్మ, భక్తులు, విశాఖపట్నం

కొత్త స్థూపం ఏర్పాటు చేస్తాం



శ్రీకృష్ణదేవరాయల విజయ స్థూపం ప్రాంగణాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు ఉన్నాయి. అప్పట్లో నీటి సమస్య ఉండటంతో అవి సాధ్యపడలేదు. ఇప్పుడా పరిస్థితి లేదు. లోహంతో ఉన్న స్థూపం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో కొత్త స్థూపం పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నాం. త్వరలోనే అన్ని పనులూ పూర్తి చేస్తాం.

– శ్రీనివాసరాజు, ఈఈ, సింహాచలం దేవస్థానం

ఉత్తమ ఉపాధ్యాయుడు గంగాధర్‌కు సత్కారం



గంగాధర్‌ను సత్కరిస్తున్న ఏయూ పూర్వ వీసీ జీఎస్ఎన్ రాజు

పరవాడ: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మండలంలోని బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొరుప్రోలు గంగాధర్‌ను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కేఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు. విశాఖ గాంధీ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సత్కార సభలో ఉత్తమ ఉపాధ్యాయుడు గంగాధర్‌ను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య బాలమోహన్‌దాస్, విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బాక్సింగ్‌లో సత్తా చాటిన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

పరవాడ: విశాఖపట్నం పోర్టు స్టేడియంలో ఇటీవల జరిగిన బాక్సింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి తెలిపారు. బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన జి.గౌతమి, ధార్మిక, శ్రీష్టిప ర్మాలు మచిలీపట్నంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అందుకు కారకులైన కోచ్‌లు అమర్‌నాథ్, అన్నపూర్ణలను పాఠశాల సీఈవో నిశాంత్‌తో కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం ...శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

నిద్రమత్తులో 'నిఘా' నేత్రం

- పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- తరచూ 'నిఘా' కళ్లను మూసేస్తున్న నాయకుల ప్రచార ఫ్లెక్సీలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీస్ యంత్రాంగం



పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన నిఘా సీసీ కెమెరాలు



తరచూ కెమెరాలకు అడ్డుగా ఏర్పాటు చేస్తున్న నాయకుల ప్రచార ఫ్లెక్సీలు

పెందుర్తి: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు.. నగరానికి అనుసంధానంగా ఉన్న అత్యంత రద్దీ కూడలి పెందుర్తి. ఓ వైపు నుంచి అరకు, విజయనగరం, మరోవైపు నుంచి పాడేరు, చోడవరం, దేవరాపల్లి, ఇంకోవైపు నుంచి భీమిలి, ఆనందపురం, ఒడిశా ఇలా అన్ని ప్రాంతాలను కలుపుతూ నగరానికి దారి చూపే నాలుగు రోడ్ల కూడలి ఇది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే క్రమంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలకు కొదవలేదు. ఏజెన్సీ ప్రాంతాలకు నగరానికి ఇదే ప్రధాన కూడలి కావడంతో గంజాయి ఇతరత్రా స్మగ్లింగ్ వ్యవహారాలకు అనుకూలం. ఇటువంటి ప్రాంతంలో నిఘా ఎంత పటిష్టంగా ఉండాలి. కానీ పెందుర్తి కూడలి వద్ద ఉన్న నిఘా నేత్రాలు తరచూ మూతపడుతున్నాయి. ఓ వైపు పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం.. మరోవైపు నాయకుల ప్రచార యావ పెరిగిపోయి ఏకంగా నిఘా నేత్రాల్నే కమ్మేస్తున్నాయి. దీంతో పెందుర్తి కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అవసరానికి అక్కరకు రాకుండా పోతున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఇలా అయితే ఎలా?

ఇటీవలకాలంలో పెందుర్తి ప్రాంతంలో నేరాల సంఖ్య పెరిగింది. దీంతోపాటు ఏజెన్సీ నుంచి నగరానికి, ఇతర రాష్ట్రాలకు పెందుర్తి మీదుగానే గంజాయి తరలిపోతున్నట్లు చాలాసార్లు రుజువైంది. దీంతోపాటు ఈ ప్రాంతంలో ప్రమాదాలకు కరవు లేదు. ఈ క్రమంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని భావించిన పోలీసులు అందుకు తగ్గట్టుగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని పెందుర్తి పోలీస్‌స్టేషన్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. ఫ్లెక్సీల అడ్డంకితో పలుమార్లు ఈ సీసీ కెమెరాల ఫుటేజీ పనికిరాకుండా పోయింది.

నాయకుల బాధ్యతారాహిత్యం

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన నాయకులు మాత్రం ఇక్కడ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తరచూ జన్మదినాలకు, పండగలు, పార్టీ కార్యక్రమాల పేరిట పెందుర్తి కూడలిని ఫ్లెక్సీలు, బ్యానర్లతో ముంచెత్తుతున్నారు. చాలాసార్లు ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలను సైతం మూసేస్తూ తమకు తాము ఫ్లెక్సీల ద్వారా 'భజన' చేసుకుంటున్నారు. వారం పదిరోజుల పాటు నాయకుల ఫ్లెక్సీలు అలానే ఉన్నా.. అధికారులు మాత్రం చర్యలకు సాహసించలేకపోతున్నారు. చాలా వరకు అధికార పార్టీల నేతలు, వారి అనుచరులవే ఈ ఫ్లెక్సీలు కావడంతో చూసీచూడనట్లుగా పోతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరిచి నిఘాపై నిక్కచ్చిగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నేస్తాలు

- కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు
- ఉత్సాహంగా వక్తృత్వ, దేశభక్తి గీతాలాపన పోటీలు



గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పిస్తున్న వక్తలు, విద్యార్థులు

పెందుర్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'శారీరక పరిశుభ్రత', 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'చదవడం మాకిష్టం'అంశాలపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. అనంతరం జరిగిన సాహిత్య గోష్ఠి–ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి.పైడిరాజు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి మూర్తి, విశ్రాంత తహసీల్దార్ డాక్టర్ పి.సింహాచలం, విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.జానకిరామ్, ఆర్.ప్రసాద్ పలు అంశాలపై చర్చించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గ్రంథాలయశాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారోత్సవాల్లో ఐదోరోజు సోమవారం పుస్తక ప్రదర్శన, ఆరో రోజు మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు, ఇందిరాగాంధీ జయంతి, ముగ్గులు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజు బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు.

ఘనంగా దేశభక్తి గీతాల పోటీలు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు పాఠశాలల విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన పోటీలతోపాటు, చదువంటే మాకిష్టం అనే అంశంపై డిబేట్ నిర్వహించారు. కార్మిక నేత సీహెచ్ సూర్యనారాయణరాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు వేణు, రాజేష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, ఉద్యోగి ఎల్లమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

సబ్బవరం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు భాష–సాహిత్య ప్రక్రియ–పరిణామ క్రమం, గ్రంథాలయ ఉద్యమ నేతలు తదితర అంశాలపై కవితలు వినిపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రచయిత అరసాడ సూర్యనారాయణరావు కల శీర్షికన కవితలు వినిపించి, ఆకట్టుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి.నరసింహమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన రచయిత అరసాడ సూర్యనారాయణరావును సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష, పీవీఆర్ పట్నాయక్, డీపీ పాణి, బి.సుభాషిణి, ఎస్.కుమారి, పి.సత్యనారాయణ, కె.వీర్రాజు, ఎ.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థి



రచయిత సూర్యనారాయణరావును సత్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు

త్వరితగతిన అభివృద్ధి పనులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ముమ్మన

పెందుర్తి: వార్డులోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికారులను సూచించారు. పాపయ్యరాజుపాలెం సమీపంలోని వసంత గార్డెన్స్ వద్ద జరుగుతున్న రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందన్నారు. ఆయన వెంట అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాగరతీరం.. కోలాహలం

పరవాడ: ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారాయి. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సబ్బవరం, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, ఎన్టీపీసీ దీపాంజలినగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు తీర ప్రాంతాలకు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సరదాగా గడిపారు. సముద్రంలో జలకాలాటలతో ఉల్లాసంగా గడిపి, తిరుగుముఖం పట్టారు.



తిక్కవానిపాలెం తీరంలో పర్యాటకుల సందడి

ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటించే వరకు ఉద్యమం



మాట్లాడుతున్న జగ్గునాయుడు

అగనంపూడి:విశాఖస్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు అన్నారు. సీపీఎం స్టీల్ డివిజన్ 5వ మహాసభను ఆదివారం వడ్లపూడిలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం జోన్ పరిధిలో చేపట్టిన ఉద్యమాలు, కార్యక్రమాలతో ప్రజల ఆదరణ పొందిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1500 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించి ఉద్యమంలో ప్రజలను మమేకం చేయగలిగామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక : కార్యక్రమంలో స్టీల్‌జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పీపీఎస్‌బీ శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులుగా అయోధ్య రామ్, యు.రామస్వామి, టీవీకే రాజు, ఎన్.రమణ, జి.శ్రీనివాస్, బి.తవుడన్న, కె.వేణు, బి.గురప్ప, జి.సూరిబాబు, యు.మరిడయ్య ఎన్నికయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com